ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
మంగళవారం 08-09-2026 పేజీలు : 16

## పవన్ ఆత్మ శాంతించాలని యువకులు
# కొవ్వొత్తుల ర్యాలీ



10 పేజీలో...

# మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై విస్తృత అవగాహన
- కలెక్టరేట్‌లో అవగాహన గోడ పోస్టర్ ఆవిష్కరణ
- మట్టి వినాయక విగ్రహాల స్టాల్ ప్రారంభం.. ఉచిత పంపిణీ
- ప్రజలు పర్యావరణహిత విగ్రహాలనే వినియోగించాలి: అధికారులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని అధికారులు పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ, ఐ.ఏ.ఎస్., జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్., తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ తదితర అధికారులతో కలిసి పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై రూపొందించిన అవగాహన గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, సాధారణ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రజలు ప్రోత్సహించాలని అధికారులు సూచించారు. ప్రతి సంవత్సరం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. "మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని ఆయన కోరారు.

# 6 గ్యారెంటీలు.. 420 హామీలకు దిక్కెక్కడ?

- ఓట్ల కోసం హామీలు.. అధికారం వచ్చాక మరిచారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ధ్వజం
- హామీల అమలుపై ప్రజల తరపున చార్జ్‌షీట్.. శ్వేతపత్రం విడుదల చేయాలి...



7 పేజీలో...

# మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో మద్యం విక్రయించరాదు

**- ఏసీపీ రత్నం ప్రకాష్**



జన్నారం, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : లిక్కర్ షాపు యజమానులు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో మద్యం విక్రయించరాదని ఏసీపీ రత్నం ప్రకాష్ సూ చించారు. సోమవారం రోజున జన్నారం పోలీస్ స్టే షన్ లో ఏసీపీ రత్నం ప్రకాష్ మండలంలో లైసెన్స్ కలిగి ఉన్న లిక్కర్ షాప్ యజమానులకు మద్యం విక్రయాల విషయంలో తప్పనిసరిగా పాటించాల్సి న నిబంధనలపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని, వయస్సుపై అనుమానం వస్తే వయస్సు ధృవీకరణ పత్రం చూసిన తర్వాతే మద్యం విక్రయించాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి లిక్కర్ షాప్‌లను తప్పనిసరిగా మూ సివేయాలని నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎలాంటి మద్యం విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి లిక్కర్ షాప్‌లో సీసీ టివి కెమెరాలను ఏర్పాటుచేసి అవి నిరంతరం పనిచేసేలా చూడటం తోపాటు సిసి టివి ఫుటేజ్‌ను నిబంధనల ప్రకారం భద్రపరచాలని సూచించారు. షాపుల వద్ద ఎలాం టి అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలని నిబంధనలను ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు లక్షటిపేట సిఐ రమణమూర్తి, స్థానిక ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ తదితరులు ఉన్నారు.

# డేంజర్ జోన్ ఇళ్లకు పరిహారం చెల్లించండి

మల్హర్, సెప్టెంబర్ 07 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచెర్ల టీజీ జెన్‌కో ఓసీపీ బ్లాక్-1కు 500 మీటర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్ల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. తాడిచెర్లలో డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లకు పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా ఇప్పటివరకు పరిహారం అందలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం నుంచి ఇళ్ల సేకరణకు నిధులు మంజూరై కలెక్టర్ ఖాతాలో జమ అయినప్పటికీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని తెలిపారు. వెంటనే గ్రామసభ నిర్వహించి ఇళ్ల సేకరణ పూర్తి చేసి నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, మాజీ సర్పంచ్ దన్నపనేని అశోక్‌రావు, భూ నిర్వాసితుల కమిటీ నాయకులు కేసారపు చంద్రయ్య, అర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య, మాచర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మార్వోను వెంబడించిన ఇద్దరు వ్యక్తులు - పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు




మందమర్రి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు విధులు ముగించుకొని క్యాతన్ పల్లి ఇంటికి వెళ్తున్న మందమర్రి ఎమ్మార్వోను కారులో వెంబడించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఇంటికి వెళ్ళిన అనంతరం శ్రీనివాస గార్డెన్ సమీపంలో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే కారు వెంబడించినట్లు ఎమ్మార్వో సతీష్ కుమార్ శర్మ చెప్పున్నారు. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. మందమర్రి ప్రాంతానికి చెందిన వ్యక్తితో పాటు క్యాతన్ పల్లికి చెందిన మరొకరు కారులో ఉన్నట్లు తెలిపారు. సంబంధించిన ఫిర్యాదును పరిశీలించిన ఆర్కేపీ ఎస్సై జాడి శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పరకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేసిన పరకాల పట్టణ వాస్తవ్యులు




హనుమకొండ జిల్లా పరకాల : పరకాల పరిధి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) గా ఎ. ప్రవీణ్ కుమార్ గారు నూతనంగా విచ్చేసి పదవి బాధ్యతలు చేపట్టి విధులు నిర్వర్తిస్తున్న వారిని పరకాల పిఎస్ లో ఘనంగా పూల బొకేతో స్వాగతించి, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, పెద్ద రాజిపేటమాజీ సర్పంచ్ పెద్ద రాజయ్య, బొచ్చు రవి, ఎకు రమేష్ లు కలవడం జరిగింది.

# పేటలో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 7: విజన్ ఆంధ్ర : పెద్ద శంకరంపేట్ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని ఫీజుల బకాయి బిజెపి లడాయి పేరుతో బిజెపి రాష్ట్ర నాయకత్వం సోమవారం చలో అసెంబ్లీ పిలుపు ఇవ్వడంతో పెద్ద శంకరంపేట లో పోలీసులు బిజెపి నాయకులను ముందస్తు చేశారు.. పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. మండల బిజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. ఎర్ర శ్రీహరి చందుపట్ల అనిల్ శంకర్రావు.. ధ్రువ కుమార్.. సాయిలు.. భూషణం.. సుకుమార్ ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు..




# 'కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అంత డొల్ల'




మందమర్రి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అంత డొల్ల నేనని,ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఆదివారం క్యాతన్ పల్లి లోని బాల్క సుమన్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొప్పుల ఈశ్వర్,బాల్క సుమన్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో చెన్నూరు ప్రాంత నిరుద్యోగుల కోసం ప్రకటించిన 45 వేల ఉద్యోగాలు ఎంత మందికి ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. ఎంత సేపు అధికారం,ఆస్తులను కాపాడుకోవడం కోసం కాకుండా చెన్నూరు ప్రాంత అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని సూచించారు. ఆరు గ్యారెంటీల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న నాయకులు,కార్యకర్తల మీద కేసులు పెడుతూ ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో మేము తెచ్చిన నిధులను, పనులను చూపిస్తూ ప్రారంభించడం కాదు కొత్తగా నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలన్నారు. మంత్రి వివేక్,ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కేంద్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ వారం రోజుల పాటు బీఆర్ఎస్ అనేక పోరాటాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సుమన్ చెప్పారు.

### "సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది"

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని,కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన మందమర్రిలో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సులో కొప్పుల ఈశ్వర్ మాటాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ నాయకత్వంలో సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు వారి సంక్షేమం, హక్కుల కొరకు అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహించకుండా వాయిదా వేసే కుట్ర చేస్తుందని, కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు వస్తే కార్మికులందరూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

# సర్ నోటీసుల హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన సర్పంచ్

జన్నారం, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : సర్ నోటీ సుల హియరింగ్ ప్రక్రియను సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, తహసీల్దార్ బక్కయ్యతో కలిసి పరిశీలిం చారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు గత నె లలో చేపట్టిన ఓటర్ జాబితా సవరణలో భాగంగా జన్నారం మండలంలోని పోనకల్ గ్రామ ప్రజలు పూరించి ఇచ్చిన పత్రాలలో కొందరివి తప్పులు ఉ న్నాయని వారికి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ తప్పులను సరి జేసేందుకు సోమ వారంరోజున గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్ నోటీసుల హియరింగ్ ప్రక్రియ ను సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, తహసీల్దార్ బక్కయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణ ప్రక్రియలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచ్ అడిగి తెలుసుకున్నారు. అ ర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాల ని పొరపాటున చేసిన తప్పులను సరిజేసి ఏ ఒక్క రి ఓటు తొలగిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ



కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ అప్పలా జలపతి, ఆర్ఐ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి రేగొండ రాహుల్, వార్డు సభ్యులు మోసిన్ షా ఖాన్, పిల్లి మల్లయ్య, బిల్ కలెక్టర్ అనిల్, రజాక్, జాజాల శ్రీకాంత్, నగూరు మహేందర్ రెవెన్యూ, గ్రామపం చాయతీ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ వేడుకలు నిర్వహించాలి: డీఎస్పీ ప్రసన్నకుమార్

పాపన్నపేట, సెప్టెంబర్7, (విజన్ ఆంధ్ర); గణేష్ నవరాత్రి ఉ త్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. పాపన్నపేటలోని మంజీరా ఫంక్షన్ హాల్లో గణేష్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ గణేష్ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే 112 నంబర్కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ ప్రసన్నకుమార్



తెలిపారు. ప్రజలు, గణేష్ మండలి సభ్యులు సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్తో పాటు వివిధ గ్రామాలకు చెందిన గణపతి మండలి సభ్యులు పాల్గొన్నారు.

# గాజులపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్,సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): మండలంలోని గాజులపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థికసాయాన్ని సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి ఆధ్వర్యంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ సర్పంచ్ పంజ స్వామి లబ్ధిదారులకు అందించారు. గ్రామానికి చెందిన మారుపాక కల్పనకు రూ. 16,500, పంచ సత్యనారాయణకు రూ. 20,500 విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందడం కొంత ఊరటనిస్తుందని సర్పంచ్ పంజ స్వామి పేర్కొన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం యేసు, తోట నరేష్, దాసరి బిక్షపతి, పోతిగంటి మల్లారెడ్డి, పోతుగంటి శ్రీనివాస్, పాండర్రెడ్డి, దాసరి నాగయ్య, పాశం గంగయ్య, మాదారు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.




# లక్షటిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

జన్నారం, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : లక్షటిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గా న్ని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. సోమవారం రోజున లక్షటిపేట సర్కిల్ పరిధికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు సమావేశ మై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. అధ్యక్షులుగా చెట్ల రమేష్, ప్రధానకార్యదర్శిగా నూతి సంతోష్, ఉపాధ్యక్షులుగా కందుల రమేష్ ,కొండపల్లి ప్రశాంత్ లు, జాయింట్ సెక్రెటరీలుగా నూతి అనిల్, కందుల సతీష్ , కోశాధికారిగా పార వెల్లి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా వై. శ్రీనివా స్, ఆకుల కిరణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు, ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడు తూ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అభివృద్ధికి ఎ ల్లవేళలా ముందుంటానని పాత్రికేయుల సమస్య లను పరిష్కరించడానికి కృషి చేయడమే కాకుడా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను పాత్రికేయుల కు అందేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో లక్షటిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# జన్నారం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



జన్నారం, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : మందకృ ష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం రోజున జన్నారం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గొనె ప్రభాక ర్,అధికార ప్రతినిధిగా కొండూకురి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా దుమల్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా ఉ పారపు శేఖర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇంచార్జి లింగంపల్లి శ్రీనివాస్ , మండల ఇంచార్జి కొండూకురి ప్రభుదాస్, జిల్లా నాయకులు మామిడిపెల్లి ఇంద్రయ్య, దుమల్ల రమేష్, సత్యనా రాయణ, మంద రాజేష్, దుమల్ల ఎల్లయ్య, కత్తెర పాక రాజేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కూల్చేశారు.. ఇల్లు కడుతున్నారు !

**- ప్రజాధనంతో నిర్మించిన కాలువకు మంగళం.. అధికారుల మౌనం**

**- మాచిన్‌పల్లిలో యథేచ్ఛగా నిర్మాణం.. పట్టించుకునే వారేరీ?**

దౌల్తాబాద్, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర): ప్రజల మురుగునీటి పారుదల కోసం ఏర్పాటు చేసిన డ్రైనేజీని కూల్చివేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామంలో ఈ వ్యవహారం చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన డ్రైనేజీని తొలగించి వ్యక్తిగత ఇంటి నిర్మాణానికి మార్గం సుగమం చేసుకుంటున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు సజావుగా వెళ్లేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ డ్రైనేజీని కూల్చివేసి నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మురుగునీరు వెళ్లే మార్గం మూసుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నిర్మాణం పూర్తయ్యాక చర్యలేనా?

డ్రైనేజీ కూల్చివేత విషయం అధికారుల దృష్టికి వెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన మౌలిక వసతులపై అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. నిర్మాణం పూర్తయిన తర్వాత స్పందించడం కంటే పనులు జరుగుతున్న సమయంలోనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అధికారులు స్పందించాలి

మాచిన్‌పల్లిలో డ్రైనేజీ కూల్చివేతపై సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీ ఉన్న ప్రాంతాన్ని సర్వే చేసి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని, ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్మాణం ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే మురుగునీరు సజావుగా వెళ్లేలా డ్రైనేజీని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం అధికారులు ఎప్పుడు కదులుతారో వేచిచూడాలి.

# భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎం.ఏ. లతీఫ్‌కు అవకాశం ఇవ్వాలి

**- సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా.. సామాజిక సేవకుడిగా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు**

భైంసా, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.ఏ. లతీఫ్ పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యలపై స్పందిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న లతీఫ్‌కు ఈ బాధ్యత అప్పగించాలని పార్టీ శ్రేణుల్లో డిమాండ్ వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలిచి, కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా పనిచేశారని అనుచరులు పేర్కొంటున్నారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. రాజకీయాలతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యత ఇస్తున్న లతీఫ్ విద్యార్థులకు పుస్తకాలు, నోటుపుస్తకాలు, పెన్నులు వంటి విద్యా సామగ్రి అందించడంతో పాటు పేదలు, అవసరమైన వారికి తనవంతు సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ గ్రామాలు, మండలాల్లో ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు ఎంతో కీలకమైన సంస్థ కావడంతో రైతులకు మెరుగైన సౌకర్యాలు, పారదర్శకమైన మార్కెటింగ్ వ్యవస్థ, అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.



రైతుల సమస్యలపై అవగాహన ఉన్న ఎం.ఏ. లతీఫ్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తే రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముధోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించిన లతీఫ్‌కు నియోజకవర్గంలో ప్రజలతో ఉన్న అనుబంధం, కార్యకర్తలతో సాన్నిహిత్యం, దీర్ఘకాలిక రాజకీయ అనుభవం, సామాజిక సేవా కార్యక్రమాల నేపథ్యంలో భవిష్యత్‌లో ముధోల్ ఎమ్మెల్యే టికెట్‌కు బలమైన ఆశావహుడిగా ఆయన పేరు వినిపిస్తోంది. "ప్రజలే నా బలం.. ప్రజలే నా గళం" అనే నినాదంతో ప్రజా సేవను కొనసాగిస్తున్న ఎం.ఏ. లతీఫ్‌కు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కల్పించి, ఆయన రాజకీయ అనుభవాన్ని రైతులు, ప్రజల ప్రయోజనాలకు వినియోగించుకోవాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

# డిజిటల్ పంటల నమోదు ప్రక్రియ



పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 7: విజన్ ఆంధ్ర: వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో వాలంటీర్ల ద్వారా డిజిటల్ పంటల నమోదు ప్రక్రియ పెద్దశంకరంపేట మండలంలో ఈ వానాకాలం 2026 సంవత్సరానికి 24 గ్రామాలలో వాలంటీర్ల ద్వారా డిజిటల్ పంటల నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. కావున రైతులు దీనిలో భాగంగా ఆ గ్రామానికి ఎన్నుకున్న సంబంధిత వాలంటీర్ ద్వారా వరి రకాలను తప్పనిసరిగా వారికి చెప్పి వారి ద్వారా సరైనటువంటి వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది తద్వారా ముందు ముందు జరిగే ధాన్యం కొనుగోలు ప్రక్రియలలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉంటుంది అందువలన ముందుగానే మీ యొక్క సన్న రకాలు అయినటువంటి వివరాలు తప్పనిసరిగా అది ఏ రకమువాలంటీర్ ద్వారా మీరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది అలాగే ఇతర పంటలు పత్తి కంది ,పెసర్లు, మినుములు మిగిలిన ఏ పంటలైనా కూడా వాలంటీర్ ద్వారానే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది కావున రైతులు మీ గ్రామములో జరిగే ఈ డిజిటల్ పంటల నమోదుకు వాలంటీర్స్ యొక్క వివరాలు తీసుకొని వారి ద్వారా మీ పంటలు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది ఈ పంటల నమోదు ఈనెల అనగా సెప్టెంబర్ 30వ తేదీ చివరి తేదీ అదేవిధంగా ఇదివరకు చెప్పినట్టు రైతులు ఏడు రకాల సన్న రకాల అయినటువంటి వరి విత్తనాలు డీలర్ ద్వారా కొనుగోలు చేసినప్పుడు ఆ డీలర్ దగ్గర వెళ్లి ఆన్లైన్ నమోదు చేయించుకోగలరు ఒకవేళ ఏ డీలర్ దగ్గర తీసుకోకుండా వేరే ఇతర మార్గాల ద్వారా ఈ సన్న రకాలు పండించుచున్నతో మీ వాలంటీర్లు గాని లేదా వ్యవసాయ విస్తీర్ణ అధికారులను గాని సంప్రదించవలసి ఉంటుంది రైతులకు ఏమైనా సందేహాలు ఉన్నచో వ్యవసాయ అధికారులను సంప్రదించగలరు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మండల విస్తీర్ణ అధికారి అఖిల్ వినీత్ మరియు గోపని వెంకటాపూర్ గ్రామ వాలంటీర్ శివచందర్ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చే వరకు పోరాటం

**- ఎన్నికల హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ డిమాండ్**

మల్హర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం మలహర్ మండల ప్రజావాణిలో నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెప్యాల ఇనగంటి నాగేశ్వర్ రావు, రామారావు, బానోతు రాజు కుమార్, (ఢిల్లీ రాజు) అజ్మీరా సమ్మయ్య నాయక్, పులిగంటి రామన్న, అజ్మీరా బాలాజీ నాయక్, ఇనుముల సతీష్, మందపల్లి శ్రీధర్, నోల్ల సంపత్, అక్కినవేని సమ్మయ్య, మహిళా నాయకురాలు పంతకాని చంద్రకళ, తాండ్ర మార్కు, ఇందారపు శ్యామ్ మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు పెద్దపీట వేయాలి



**- బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలి**

**- ఖాళీ పోస్టులు భర్తీ చేసి.. విద్యార్థులకు భరోసా కల్పించాలి**

**- యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. రానున్న బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కల్పించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు భారీగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక విద్యాసంస్థల్లో అవసరమైన వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని విధాలా బలోపేతం చేయాలని సూచించారు.

**ఖాళీల భర్తీకి చర్యలేవీ?**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చంద్రకాంత్ డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం చూపుతోందన్నారు. అవసరమైన మేరకు నియామకాలు చేపట్టి బోధన వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు.

**స్కాలర్‌షిప్‌లు.. రీయింబర్స్‌మెంట్ సకాలంలో ఇవ్వాలి**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**లేకుంటే ఆందోళనలు**

గత బడ్జెట్లలో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం దక్కలేదని చంద్రకాంత్ విమర్శించారు. ఈసారి బడ్జెట్‌లో విద్యకు భారీగా నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

**- సాంకేతికతతో పోయిన ఫోన్లు గుర్తింపు**

**- సిఇఐఆర్ ద్వారా ఫోన్లు రికవరీ చేసిన ఎస్ఐ మహేందర్ కుమార్**



మల్హర్, సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర : మల్హర్ రావు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు వివిధ కారణాలతో తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ విషయమై వారు కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదులపై స్పందించిన కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సిఇఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఐదు సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేసి సెల్‌ఫోన్లను కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహేందర్ కుమార్ బాధితులకు తిరిగి అందజేశారు. తమ సెల్‌ఫోన్లను తిరిగి అందజేయడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విధి వక్రీకరించి కష్టాల్లో ఉన్న కుటుంబానికి మానవత్వంతో ఆదుకున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్

**-నిరుపేద కుటుంబానికి ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన అహ్మద్ షరీఫ్ స్థానిక ఆలంగిర్ మజీద్ లో మౌజన్ గా పనిచేస్తూ ముస్లిం కుటుంబాలలో ముస్లిం పిల్లలకు సాయంత్రం సమయములో ఉర్దూ అరబ్బీ చదువులు నేర్పిస్తూ బ్రతుకు బండిలాగుతు భార్య ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు.నిరుపేద కుటుంబానికి చెందిన గోవర్ధనగిరి గ్రామానికి చెందిన అహ్మద్ షరీఫ్ కు విధి వక్రీకరించడంతో దురదృష్టవశత్తు ఇటీవల ప్రమాదంలో కాలిపాదం తీవ్ర గాయాలతో నరాలు దెబ్బతిన్నాయి.దీంతో అతను ఇంటికి పరిమితమయ్యాడు.దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవడమే కాకుండా కాకుండా ఇంట్లో పూట గడవడమే కష్టంగా మారింది.నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందుల పాలయ్యింది.ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న హుస్నాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్ వెంటనే స్పందించి అహ్మద్ షరీఫ్ ను పరామర్శించారు.ఆ కుటుంబానికి అండగా నిలబడడమే కాకుండా నాలుగు వేల రూపాయలు నగదు రూపంలో అందించి ఆర్థిక సహాయం అందించారు.మానవత్వం చాటుకున్నారు.దీంతో పలువురు ఆ కుటుంబాన్ని ఆదుకోవడంపై అలీ మహమ్మద్ ను అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఆ నిరుపేద కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని, అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# 420 హామీలను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా

**హుస్నాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిరసన**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అన్వర్ ఆధ్వర్యంలో కేటీఆర్ హరీష్ రావు మరియు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టులను ఖండిస్తూ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వ హామీలను అమలు చేయాలని తెలియజేయడానికి అసెంబ్లీకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులతో వస్తే కేటీఆర్ హరీష్ రావుతో పాటు అందరిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ను రాజీనామా చేయాలనడముపై మండిపడ్డారు పార్లమెంట్ లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నిరసన తెలపడం లేదా మరి ఇక్కడ ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 420 హామీలు 13 డిక్లరేషన్లు 6 గ్యారంటీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, ఆర్టీసీ 4వేల కోట్ల లాభాల్లో ఉందని ప్రకటించడం హాస్యాస్పదమని మరి లాభాల్లో ఉంటే ఆర్టీసీ ఉద్యోగులకు 200 కోట్లు ఇస్తే వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వారి ఉద్యోగ బకాయిలు అన్ని క్లియరెన్స్ అవుతాయని మరి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. 22 ఏ తో ప్రైవేట్ భూములను ఇబ్బందులు కల్పిస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. మీరు ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని మండి పడ్డారు. ఇప్పటివరకు ఏ ఒక్క హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని 420 హామీల ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజాక్షేత్రంలో టిఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు కన్నోజు రామకృష్ణ, కౌన్సిలర్ గాదపాక రవీందర్, బిఆర్ఎస్ నాయకులు సుద్దాల చంద్రయ్య, కవ్వ వెంకట్రాంరెడ్డి, బండి రమణారెడ్డి,చిత్తారి శ్రీనివాస్,సూరంపల్లి పరుశురాం, గడ్డం సదానందం బొజ్జ హరీష్, కూతాటి విజయభాస్కర్, ఆలుమల్ల ప్రభాకర్ రెడ్డి,భూక్య లక్ష్మణ్,మేదరవేణి శ్రీనివాస్, కందుకూరి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

**420 హామీలపై ఎంపీడీవోకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం**

హుస్నాబాద్ పట్టణంలోని ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన 420 హామీలు 13 డిక్లరేషన్లు 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ సోమవారం రోజున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవోకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# పీఎం శ్రీ పాఠశాల.. బోర్డు మాత్రం పాతదే !

**- పీఎం శ్రీ హోదా కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు....**

కుకునూరుపల్లి, సెప్టెంబర్ 07,విజన్ ఆంధ్ర : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పాఠశాల పథకానికి ఎంపికైన కుకునూరుపల్లి జెడ్పిహెచ్ఎస్ లో పీఎం శ్రీ బోర్డు కనిపించకపోవడం చర్చణీయాంశంగా మారింది. పాఠశాల ఆవరణను ఆధునికంగా తీర్చిదిద్దినప్పటికీ, ప్రధాన భవనంపై మాత్రం ఇప్పటికి "జిల్లా పరిషత్ హై స్కూల్ "పేరుతో ఉన్న పాత బోర్డే దర్శనం ఇస్తుంది. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన విషయం స్పష్టంగా తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పీఎం శ్రీ పాఠశాల పేరుతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలనీ కోరుతున్నారు.

# ఆలయాల్లో భక్తుల సందడి



ముధోల్:07సెప్టెంబర్: విజన్ ఆంధ్ర : ముధోల్ :మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు సోమవారం ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలను చేశారు. శ్రావణ మాసంలో చివరి సోమవారం కావడంతో మండల కేంద్రంలోని జటా శంకర, శ్రీ పశుపతినాథ్ ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో శివునికి బిల్వార్చన, పువ్వులతో అందంగా ముస్తాబు చేసి అన్న పూజ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. దీంతో కుబీర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన శిరీష- సూర్యవంశీ చంద్రకాంత్ పటేల్ దంపతులు శివునికి అభిషేక పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు వచ్చిన భక్తులు అన్నదానం లో పాల్గొన్నారు. శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కావాలి

**- విశ్రాంత ఉద్యోగుల హుస్నాబాద్ డివిజన్ అధ్యక్షులు తక్కలపల్లి రాజగోపాల్ రావు**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 7: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేది మంగళవారం రోజున సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనైనదని విశ్రాంత ఉద్యోగుల డివిజన్ అధ్యక్షులు తక్కళ్లపల్లి రాజగోపాల్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశానికి సభ్యులందరూ ఉదయము 10 గంటలకు హాజరు కావలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఈ నెల 10తేదిన హైదరాబాదులో నిర్వహించే విశ్రాంతర ఉద్యోగుల వివిధ సమస్యలు మరియు మహా ధర్నాలో పాల్గొనే అంశాన్ని మరియు మన యొక్క ఇతర సమస్యలను చర్చించుటకు గాను ఈ సమావేశం ఏర్పాటు చేయడమైనదన్నారు. మంగళవారం నిర్వహించే సమావేశానికి విశ్రాంత ఉద్యోగులు సభ్యులందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా కోరారు.

# లాల్‌సింగ్ నాయక్ తండాలకు బస్ సౌకర్యం కల్పించాలి

**- ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు**

చౌటకూర్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): పుల్కల్ మండలంలోని లాల్‌సింగ్ నాయక్ తండాతో పాటు విట్టల్ నాయక్ తండా, సాంగ్య నాయక్ తండాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం సమర్పించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు టీజేఎంయూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, లాల్‌సింగ్ నాయక్ తండా సర్పంచ్ లక్ష్మీ భాయి కలిసి ఆర్టీసీ డీఎంను కలిశారు. తండాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లి, ఆయా తండాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తండాలకు బస్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహకు సర్పంచ్ లక్ష్మీ భాయి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి విక్రమ్, కుమారి సాయిలు, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ ధరణి మధుకర్..

నస్పూర్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల తొమ్మిదవ డివిజన్లో సీతారాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ మంచిర్యాల గౌరవ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక కృషి ఫలితంగా మంచిర్యాల నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలోని నాలుగవ సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అంతేకాక తన స్వగ్రామమైన సీతారాంపల్లిలోని జిల్లా ఉన్నత పాఠశాల అభివృద్ధిపై మరియు విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని మరియు పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు, పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మేయర్ ధరణి మధుకర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హరే కృష్ణ ఫౌండేషన్ కు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్



సాగర్ రావు కి ఈ సందర్భంగా మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరణి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొక్కిరాల మోహన్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు,అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా. పవన్ కుమార్‌కు ఘన సన్మానం

భైంసా, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. పవన్ కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా కళాశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు అందిస్తున్న సేవలతో పాటు సాహిత్య రంగంలో డా. పవన్ కుమార్చేస్తున్నవిశేషకృషిఅభినందనీయమన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ×ూజ కోఆర్డినేటర్ డా. రవి కుమార్ మాట్లాడుతూ డా. పవన్ కుమార్ బహుముఖ ప్రతిభను కొనియాడారు. ఇప్పటివరకు 40కి పైగా వ్యాసాలు, 600కు పైగా కవితలు రచించడంతో పాటు పలు ప్రముఖ పుస్తకాలను హిందీలోకి అనువదిస్తూ సాహిత్య రంగానికి విశేష సేవలందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా "గాంధీ కో కిస్నే మారా?" వంటి రచనలను అనువదించడం ద్వారా ఆయన సాహిత్యాభిరుచి, అనువాద ప్రతిభను చాటుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు డా. పవన్ కుమార్ బోధనా నిబద్ధత, సాహితీ సేవలు, కవితా రచనా ప్రతిభ, అనువాద కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, సాహితీవేత్తగా సమాజంలో చైతన్యం కలిగించే రచనలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డా. భీమారావు, డా. ఎం. శంకర్, శ్రీ ఆర్. రాజు, డా. కల్పన, డా. ఓంప్రకాష్, డా. నహీదా, శ్రీ రాజయ్య, శ్రీ ముత్యం తదితర అధ్యాపకులు పాల్గొని డా. పవన్ కుమార్‌ను అభినందించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డా. పవన్ కుమార్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యా, సాహిత్య రంగాల్లో మరింత సేవలందించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సమరభేరి....

**- 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపణలు....**

**- ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నలు....**

**- విద్యార్థుల,నిరుద్యోగుల సమస్యలపై ఆందోళన.....**

**- మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి....**

**- ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం....**

**- అసెంబ్లీకి రానివ్వకుండా సునీత రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని రోడ్డుపై నిరసన....**

హత్నూర సెప్టెంబర్ 07 విజన్ ఆంధ్ర (హత్నూర) హత్నూరమండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు సంబంధించిన ఇతర



హామీల అమలుపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

విద్యార్థుల,నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సైతం ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, విద్యార్థులకు సంబంధించిన పథకాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేయకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని కోరారు.

గ్రామాలలో ప్రజలను కలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై అవగాహన కల్పిస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో చర్చ జరిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...



## సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్..**



నస్పూర్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సింగరేణి కార్మికులతో కలిసి ఆదివారం రోజు నిరసన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎదీ+ఖూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్, మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, ఎదీ+ఖూ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ మరియు ఎదీ+ఖూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడిపెల్లి విజిత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, వెంటనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ మరియు ఎదీ+ఖూ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో సింగరేణి కార్మికులు, ఎదీ+ఖూ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దక్షిణ కాశీగా శ్రీ కొప్పోల్ దేవాలయం

**భక్తులతో కిటకిటలాడింది**

పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 7: విజన్ ఆంధ్ర: భక్తులతో పోటెత్తిన న కొప్పోలు దేవాలయం
కొప్పోల్ లో శ్రావణ మాసపు పూజలు పెద్ద శంకరం పేట్
శ్రావణ మాసం లో ఆఖరు శ్రావణ సోమవారం పురస్కరించుకొని దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కొప్పోల్ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం లో
భక్తులు వేకువ జామున నుంచే శ్రావణమాస పూజలు చేశారు.. ఆలయ ఆవరణలో ఉన్న కోనేటిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వయంభులింగంగా వెలిసిన శివలింగానికి జలాభిషేకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం మంచి నీటి సౌకర్యం కల్పించారు.. శ్రావణమాసం దగ్గర పడుతుండటం తో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.



# వరి పంటకు పత్తి మందు..

బెల్లంపల్లి సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : వరి పంటలో కలుపు నివారణకు మందు అడిగితే పత్తి పంటకు వినియోగించే మందు ఇచ్చారని, దానిని వరి పంటకు పిచికారీ చేయడంతో రెండు ఎకరాల పంట పూర్తిగా నాశనమైందని కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామానికి చెందిన రైతు కిష్టయ్య ఆరోపించారు. ఫర్టిలైజర్ దుకాణం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే పంట నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.
రైతు కిష్టయ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. పంటలో గడ్డి, కలుపు ఎక్కువగా పెరగడంతో వాటి నివారణ కోసం బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లి వరి పంటకు ఉపయోగించే కలుపు మందు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అయితే దుకాణ నిర్వాహకులు పత్తి పంటకు వినియోగించే వేరే మందు ఇచ్చారని ఆరోపించారు.
దుకాణంలో ఇచ్చిన మందు వివరాలు తెలియక వరి పంటలో పిచికారీ చేశామని తెలిపారు. మందు పిచికారీ చేసిన రెండు రోజుల్లోనే వరి

**ఫర్టిలైజర్ షాపు నిర్వాకం.. రెండు ఎకరాలు నాశనం!**

పంట పూర్తిగా దెబ్బతిని చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పెట్టుబడితో పాటు పంట దిగుబడిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.
ఈ విషయంపై దుకాణ యజమానిని ప్రశ్నించగా తమకు ఎలాంటి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రైతు ఆరోపించారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులను ఆశ్రయించి తమ పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.
వరి పంటకు బదులు పత్తి పంటకు ఉపయోగించే మందు ఎందుకు ఇచ్చారనే అంశంపై అధికారులు విచారణ చేపట్టాలని రైతు డిమాండ్ చేశారు. మందు వల్లే పంట నాశనమైందని నిర్ధారణ అయితే సంబంధిత దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు నష్టపరిహారం అందేలా చూడాలని కిష్టయ్య కోరారు.

# అసెంబ్లీ ఘటనపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

**- సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసన**

**- కుత్బుల్లాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

**- నల్లచొక్కాలతో నిరసన.. చొక్కాలు విప్పి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. పోలీసుల చర్యను నిరసిస్తూ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చొక్కాలు విప్పి తమ నిరసనను వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు నిరసనగా కుత్బుల్లాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ 131వ డివిజన్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని అన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై చేయి చేసుకుని, జుట్టు పట్టి లాగినట్లు ఆరోపణలు రావడం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల ఇలాంటి వ్యవహారం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసనను అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుంటోందని నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. పోలీసుల చర్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, బీఆర్ఎస్ 131వ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, రాకేష్, జయం చారి, జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని ఇతర డివిజన్ల సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# హామీలు అమలు చేయని ప్రభుత్వాలకు యువతే బుద్ధి చెబుతుంది!

**- ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రిక విడుదల**

**- నిరుద్యోగం.. ధరల పెరుగుదలపై ప్రభుత్వాలను నిలదీస్తాం**

**-యువతకు ఉద్యోగాలు.. విద్య.. సమాన అవకాశాలు కల్పించాలి**

**- సెప్టెంబరు 8, 9, 10న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు**

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు బోనాల ప్రవీణ్ కుమార్ విమర్శించారు. యువత, నిరుద్యోగులు, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం వంటి హామీల అమలుపై ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని, ఆర్థిక వృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందడం లేదని విమర్శించారు.

యువత భవిష్యత్తుపై ప్రభుత్వాలకు బాధ్యత ఉండాలి

ఏఐవైఎఫ్ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కె. కీర్తి బాబు మాట్లాడుతూ స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. యువత సమస్యలను కేవలం ఉద్యోగాల కోణంలో చూడకుండా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలతో ముడిపెట్టి చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగం, విద్య, ధరల పెరుగుదల, సామాజిక అసమానతలపై యువత తరఫున ప్రజాస్వామ్య పద్ధతుల్లో గళమెత్తుతామని తెలిపారు. యువత సమస్యలను ప్రజా సమస్యలుగా మార్చి, వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సెప్టెంబరు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలకు యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు బోనాల ప్రవీణ్ కుమార్, కార్యదర్శి కె. కీర్తి బాబు, కార్యవర్గ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పాదయాత్ర భక్తులకు పండ్లు పంపిణీ...



బోధన్, సెప్టెంబర్07 (విజన్ ఆంధ్ర) : శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా బోధన్ డివిజన్ సాలూర మండలంలోని పలు గ్రామాల భక్తులు ప్రసిద్ధిగాంచిన శ్రీ చక్రేశ్వర శివమందిరానికి పాదయాత్రగా వెళ్లారు. ఈ క్రమంలో సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు పండ్లు, మంచి నీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం చివరి రోజున ప్రతి సంవత్సరం లాగానే పాదయాత్రగా వెళ్లే భక్తులకు పండ్లు మంచినీటిని అందించడం జరుగుతుందన్నారు. లోక కళ్యాణం,ప్రజల సంక్షేమం కొరకు ఈ పాదయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందర్న గ్రామస్తులు సుభాష్ పటేల్, సుధాకర్ పటేల్, గోపాల్ పటేల్, ఓట్లప్ప, బాలు, సందీప్, మహిళా భక్తులు, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

## తాత మధుని భర్తరఫ్ చేయాలి

**- డాక్టర్ పిడమర్తి రవి**

అసెంబ్లీ నడిపించే నాయకులు, రాజ్యాంగబద్ధమైన వ్యక్తులు స్పీకర్ ప్రసాదు గారిని అసభ్య పదజాలంతో ,బూతులతో మాట్లాడిన ఖమ్మం స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడమర్తి రవి పక్కలగడ్డ శేఖర్ డిమాండ్ చేశారు ఈరోజు హైదరాబాదులో మాట్లాడుతూ గతంలో ఈయన అమెరికాలో సమైక్యాంధ్ర సంఘానికి నాయకుడుగా వ్యవహరించి తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేశాడు ఆ తర్వాత ఇండియాకు వచ్చి ఖమ్మంలో రాజకీయాలు చేస్తూ కేసీఆర్ మోచేతి నీళ్లు తాగి రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ ల్యాండ్ పదవులు తీసుకుని తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం చేసిండు అదేవిధంగా ఇప్పుడు గౌరవ మండలి సభ్యుడుగా ఉండి స్పీకర్ని దూషించిండు కనీసం సౌజన్య సంస్కారం లేని వ్యక్తి అమెరికాలో ఓటర్ల పని చేసిండా చిప్పలు కడిగిండా బంకులలో పనిచేసిన ఒక ఎమ్మెల్యే సాయి ఉండి పబ్బులో కూడా చేసినట్టుగా వాటర్ ట్యాంక్ దగ్గర కూడా చేసినట్టుగా ఆయన వ్యవహారం ఉంది ఇటువంటి వ్యక్తి అసెంబ్లీలో మండలలో ఉండడానికి అర్హత లేదు అతనిపైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన్ని భర్తలకు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నా

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం ప్రజావాణిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుమారు 300 దరఖాస్తుల సమర్పణ

**- ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే హామీలు నెరవేర్చాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్**

**- ప్రజల పక్షనా బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది - మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్**

మెదక్ /రేగోడ్ సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ): ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి,వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రేగోడ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు సోమవారం రేగోడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలు,ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు సంబంధించిన అంశాలపై సుమారు 300 దరఖాస్తులను రేగోడు ఎంపీడీవో కు సమర్పించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అధికారులలు వినతులు ఇచ్చి ప్రభుత్వంనికి గుర్తుచేస్తూ... అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్ డిమాండ్ చేశారు.హామీల అమలులో ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరపున మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేగోడు మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వినోద్ కుమార్ ,ఉప అధ్యక్షులు గోపాల కృష్ణ యాదవ్,మాజీ ఏయంసి డైరెక్టర్ భాస్కర్,మాజీ సర్పంచ్ నర్సింలు,తుకారాం నాయక్,మాజీ ఉప సర్పంచ్ పండల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ మండల అధ్యక్షులు బాబా,ఎస్సై సెల్ మండల అధ్యక్షులు బాలయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు విట్టల్,సీనియర్ నాయకులు వీరా రెడ్డి,సంగారెడ్డి, కిష్టయ్య,పాండు నాయక్, రమేష్ నాయక్,సాయిలు,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు సంతోష్ రావు రాజు,వెంకటేశం,రఘునాథ్,వెంకట్ రెడ్డి,వినయ్ కుమార్,రఘుపతి,దిలీప్,షాదుల్, క్రిష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం దుర్మార్గం

**-ప్రజా సమస్యలను ప్రశ్నించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

**- నల్ల దుస్తుల పేరుతో అరెస్టులు చేయడం సరికాదు**

**- ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజల తరపున పోరాటం ఆగదు: శంభీపూర్ క్రిష్ణ**

దుండిగల్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించేందుకు వర్షాకాల సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దుండిగల్–గండిమైసమ్మ సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి శంభీపూర్ క్రిష్ణ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కేవలం నల్ల దుస్తులు ధరించారనే కారణంతో ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు మాత్రమే కాకుండా ప్రజల తరపున ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యత కూడా అని శంభీపూర్ క్రిష్ణ అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# 6 గ్యారెంటీలు.. 420 హామీలకు దిక్కెక్కడ?

**- ఓట్ల కోసం హామీలు.. అధికారం వచ్చాక మరిచారు**

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ధ్వజం**

**- హామీల అమలుపై ప్రజల తరఫున చార్జ్ షీట్.. శ్వేతపత్రం విడుదల చేయాలి...**

బెల్లంపల్లి, సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించి.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరించిందని బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజల ఆశలతో అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు అదే ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేతృత్వంలో సోమవారం బెల్లంపల్లి నియోజకవర్గంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలును డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ.. “ప్రజల ఓట్లతో అధికారం సంపాదించారు.. కానీ ప్రజలకు ఇచ్చిన మాటను మాత్రం మరిచారు” అని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పుడు కాంగ్రెస్ నేతలకు గుర్తున్నాయా? లేక అధికారం చేతికొచ్చాక అన్నీ మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

హామీల అమలు విషయంలో రోజుకో సాకు.. పూటకో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సమస్యలను పక్కదారి పట్టించడం ఇక సాధ్యం కాదన్నారు.

లెక్క చెప్పాల్సిందే

ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలు చేశారు? 420 హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? మిగిలిన హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారు? అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పూర్తి లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, పేదలు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాటలతో కాలం గడపకుండా.. ఇచ్చిన హామీలను చేతల్లో చూపించాలని హితవు పలికారు.

“కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల హామీలు కేవలం ప్రచార నినాదాలు కావచ్చు. ప్రజలకు మాత్రం అవే భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలు. ఆ ఆశలను వమ్ము చేస్తే ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారు” అని శ్రావణ్ హెచ్చరించారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, హామీల అమలుపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. “ఇది సాధారణ వినతిపత్రం కాదు.. ప్రజల తరపున ప్రభుత్వానికి ఇచ్చిన చార్జ్‌షీట్” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నునేటి సత్యనారాయణ, మాజీ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు గోగర్ల స్వప్న, కాంపెల్లి రాజం, పార్టీ ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, యువజన విభాగం అధ్యక్షుడు సబ్బని అరుణ్, మాజీ కౌన్సిలర్లు రాజులాల్ యాదవ్, తాండ్ర రామకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు వాజిద్, నాయకులు బండారి ప్రవీణ్, కలీం, కలీల్ పాషా, దాగం చరణ్, బేడ్డల మహేందర్, సోతుకు శ్రీనివాస్, యువజన నాయకుడు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## దళిత సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

అనంతపురం విద్య సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): ఈనెల 28వ తేదీన ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఆధ్వర్యంలో దాదాపు 50 సంఘాలతో కలిసి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మధు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు చేరవలసిన వివిధ సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా భారీ ఎత్తున కలెక్టరేట్ ముట్టడికి పూనుకున్నామని అన్నారు. కావున ఉమ్మడి జిల్లాలోని అన్ని దళిత సంఘాలు కుల సంఘాలు ఏకమై ఈ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తమ హక్కులను పొందేందుకు ప్రతి దళిత సోదరుడు కదిలి రావాలని మధు ప్రసాద్ పిలుపునిచ్చారు.

## ఆర్ఆర్ హోటల్ ప్రారంభించిన వేముల విపుల్



చిట్యాల సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర); చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలో జాతీయ రహదారి 65 పక్కన కొండె రఘుపతి,అరూరి రమేష్ లు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ హోటల్ ను సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశం తనయుడు వేముల విపుల్ కుమార్ ప్రారంభించి హోటల్ యజమాన్యంకు శుభాకాంక్షలుతెలిపారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని భోజన ప్రియులకు అందించి కస్టమర్ల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలిమినేడు సింగల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమా రెడ్డి, వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య,ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య, బొంగొని చెరువు గ్రామ సర్పంచ్ కట్ట ఆశయ్య,సీనియర్ నాయకులు అంతటి నరసింహా గౌడ్, సుర్కంటి సత్తిరెడ్డి,అంశాల సత్యనారాయణ,అంశాల శ్రవణ్ తదితరులు,పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఐదు దరఖాస్తులు

**బి19 మంది అధికారులు హాజరు.. రెవెన్యూ సమస్యలపై మూడు వినతులు.**

మెదక్ /రేగోడ్ సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ): రేగోడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు దరఖాస్తులు అందాయి.కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు 19 మంది హాజరై ప్రజల సమస్యలను స్వీకరించారు.రెవెన్యూ శాఖకు సంబంధించి మూడు దరఖాస్తులు వచ్చాయి. మర్పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 151/1కు సంబంధించిన రెవెన్యూ రికార్డుల స్థితిని పరిశీలించి వివరాలు అందించాలని ఒకరు కోరారు.టి.లింగంపల్లి గ్రామంలో ఇనాం భూమికి సంబంధించి మీ–సేవలో వేలిముద్రలు నమోదు చేసినప్పటికీ పాస్‌బుక్ రాలేదని మరో దరఖాస్తుదారు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రేగోడు గ్రామపంచాయతీ పరిధిలో భూమి పేరు మార్పిడి చేయాలని మరో దరఖాస్తు అందింది. పంచాయతీరాజ్ గ్రామీణ శాఖకు సంబంధించి జగిర్యాల గ్రామపంచాయతీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఒకరు వినతిపత్రం సమర్పించారు.ఇదిలా ఉండగా రేగోడ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి,దరఖాస్తుదారులకు రసీదులు అందజేసినట్లు అధికారులు తెలిపారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతోంది

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్ : జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.

సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సి.ఈ.ఓ) సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పురోగతిని సి.ఈ.ఓకు వివరించారు.

జిల్లా లో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ లో భాగంగా ఇప్పటివరకు 236590 నో మ్యాపింగ్, డిస్క్రిపెన్సీస్ ఇన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వాటి పంపిణీతో పాటు విచారణ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 77 శాతం నోటీసులు పంపిణీ పూర్తయిందని, మిగిలిన 23 శాతం పంపిణి ఈ వారం లోపల పూర్తి చేస్తామని తెలిపారు. విచారణలను త్వరితగతిన పూర్తి చేసి, మొత్తం ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.

అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, ఎన్నికల డీటీ జాఫర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్నను దర్శించుకున్న విఆర్ రామిరెడ్డి



అనంతపురం టౌన్ సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): తాడిపత్రి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సమన్వయకర్త వి ఆర్ రామ్ రెడ్డి సోమవారం పెద్దపప్పూరు మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గ్రామ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం విఆర్ రామిరెడ్డి గ్రామంలోని పార్టీ నాయకులను కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# పౌర సేవల్లో నిర్లక్ష్యంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆగ్రహం

**•40 మంది వార్డు అధికారులకు మెమోలు జారీ కి ఆదేశాలు**

**•రోజువారీ లక్ష్యాలు తప్పనిసరిగా పూర్తి చేయాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు, పౌర సేవలు, పెండింగ్ అంశాల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, 40 మంది వార్డు అధికారులతో నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వార్డుల వారీగా వివిధ అంశాల పురోగతిని సమీక్షించిన అదనపు కలెక్టర్, ఆశించిన స్థాయిలో పనితీరు లేకపోవడం, పలు అంశాలు పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షిస్తూ.. మొత్తం డిమాండ్ రూ.53 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.16 కోట్లు మాత్రమే వసూలు చేశారని, ఇంకా రూ.37 కోట్లు బకాయి ఉన్నాయని తెలిపారు. బకాయిల వసూళ్లను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

నీటి పన్ను వసూళ్లలో మొత్తం డిమాండ్ రూ.29 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.10 కోట్లు మాత్రమే వసూలు చేశారని, ఇంకా రూ.19 కోట్లు బకాయి ఉన్నట్లు తెలిపారు. వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

మరణ ధృవీకరణకు సంబంధించి 450 కేసులు పెండింగ్‌లో ఉడటంపై అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షిస్తూ, 243 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వెంటనే ప్రారంభించి, పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు.

పన్నుల వసూళ్లు, మరణ ధృవీకరణ కేసుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి తదితర అంశాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మొత్తం 40 మంది వార్డు అధికారులకు మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

అలాగే ప్రతి వార్డు అధికారికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటిని స్పష్టంగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేసి, పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

లక్ష్యాల సాధనలో విఫలమయ్యే వార్డు అధికారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

ప్రజలకు అందాల్సిన పౌర సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. పన్నుల వసూళ్లు, పెండింగ్ కేసుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని రోజువారీ లక్ష్యాల మేరకు పనితీరు కనబరచాలని స్పష్టం చేశారు.

సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, 40 మంది వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సరాఫ్‌పల్లిలో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

చౌటకూర్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : మండల పరిధిలోని సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె మల్లమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించి గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ లక్ష్మీనరసింహులు, వార్డు సభ్యుడు నాగులగౌడ్, వంజరి మల్లేశం, ఆంజనేయులు, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



చౌటకూర్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) :- మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన లబ్ధిదారుడు గొల్ల శ్రీనివాస్ యాదవ్ నూతన గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా,సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన గృహంలోకి ప్రవేశించారు. ఈ వేడుకకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుల్తాన్‌పూర్ సర్పంచ్ చంటి గీతారాణి రమేష్, ఉపసర్పంచ్ మహేష్ యాదవ్, వార్డు సభ్యులు చెన్నారెడ్డి, ప్రభు, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు మంగళ్ మహేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రషీద్ భాయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిషన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పావని తదితరులు పాల్గొని శ్రీనివాస్ యాదవ్ దంపతులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో తమ చిరకాల సొంతింటి కల సాకారమైందని లబ్ధిదారుని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొని నూతన గృహ యజమానికి అభినందనలు అందజేశారు

## ప్రజావాణికి అధికారులు గై హాజరు

లింగాపూర్ సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో ప్రజావాణి కార్యక్రమం ను లింగాపూర్ ఎంపీడీవో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కి అధికారులు గై హాజరుతో ఫిర్యాదు దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10:00 దాటిన ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిరెవెన్యూ అధికారి అటవీ శాఖ తప్ప మిగిత శాఖలఅధికారులు సమయపాలన పాటించి హాజరయ్యారు అందులో విద్యుత్ శాఖ అధికారి ఎంపిఓ హౌసింగ్ ఏఈ సమయపాలన పాటించకుండా ప్రజా వాణి కార్యక్రమం లో గై హాజరుకాకపోవడంతో పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.




# జేఎన్‌టీయూహెచ్ విద్యార్థినికి కల్లా ఫౌండేషన్ చేయూత

**-హాస్టల్ మెస్ ఫీజు కోసం రూ.25 వేల ఆర్థిక సాయం**

చౌటకూర్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర):- జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సుల్తాన్‌పూర్‌లో బీటెక్ చదువుతున్న విద్యార్థినికి కల్లా ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) విభాగంలో ద్వితీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న రాచకొండ హర్షిణికి 2026--27 విద్యా సంవత్సరానికి హాస్టల్ మెస్ ఫీజు కోసం రూ.25,000 ఆర్థిక సాయం మంజూరు చేసింది.

ఈ మేరకు రూ.25,000 విలువైన చెక్కును సరఫ్‌పల్లి గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజుకు అందజేశారు. విద్యార్థిని చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా వచ్చే విద్యా సంవత్సరంలోనూ ఇదే విధంగా సాయం కొనసాగిస్తామని కల్లా ఫౌండేషన్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని రాచకొండ హర్షిణి, ఆమె తల్లి శాంతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేందర్ రావు, డిప్యూటీ రిజిస్ట్రార్ సత్యసాయి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఫౌండేషన్‌కు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు

పేద, ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు బాసటగా నిలుస్తున్న కల్లా ఫౌండేషన్ నిర్వాహకులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.




విశ్వనాథరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత మంది దాతలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. విద్యార్థినికి ఆర్థిక సాయం అందించేందుకు చొరవ చూపిన సరఫ్‌పల్లి సర్పంచ్ రామచంద్రారెడ్డిని కళాశాల యాజమాన్యం అభినందించింది. అర్హులైన ప్రతిభావంతులైన విద్యార్థుల విద్యకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారకుండా కళాశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# పాఠశాలల్లో పరిశుభ్రతపై నిర్లక్ష్యం సహించేది లేదు

- **బాధ్యులపై కఠిన చర్యలు: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**
- **మాడ్రన్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**
- **పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం**
- **హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీకి ఆదేశం**

మహబూబ్ నగర్ : పాఠశాలల ఆవరణలో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. సోమవారం మహబూబ్ నగర్‌లోని మాడ్రన్ పాఠశాలను ఆయన మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్(ఎంఈఓ)తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదుల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించారు. పాఠశాలలో పారిశుధ్య పరిస్థితులపై అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అజాగ్రత్త వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో



నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎం.ఈ.ఓను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, నిర్లక్ష్యం వహించే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి..సూరం సాయిరాణి ...

బెల్లంపల్లి సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : యువత సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలని ఏఐవైఎఫ్ తాండూర్ మండల అధ్యక్షురాలు సూరం సాయిరాణి అన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిరాణి మాట్లాడుతూ.. దేశంలో సుమారు 40 శాతం యువత ఉన్నప్పటికీ వారి శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక పథకాలు రూపొందించకపోవడంతో నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పూర్తిస్థాయిలో భర్తీ చేపట్టలేదని ఆరోపించారు. యువజన వికాస పథకం పేరుతో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటివరకు ఎంపిక ప్రక్రియ, రుణాల మంజూరు జరగలేదన్నారు.

మహాసభల్లో యువత ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధి, విద్య తదితర సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. తాండూర్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి కుర్సింగ తిరుపతి, కోశాధికారి రాదండి నాగలక్ష్మి, మెట్టుపల్లి ధర్మయ్య, దాసరి లక్ష్మి, బలగం లావణ్య, కమ్మరి చంద్రయ్య, బుతుకూరి మంజుల, మండల గోలేటయ్య తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం

లింగాపూర్ సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర )కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని లింగాపూర్ బిఆర్ఎస్ పార్టీ స్థానిక సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాటోత్ రాహుల్ సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇవ్వడం జరిగింది అందులో ఒక్కటి కూడా అమలు చేయలేదు రెండు లక్షల రుణమాఫీ 100 రోజులలో 6 గ్యారంటీలు రైతు భరోసా మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే ఈ హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో అవినీతిపై విచారణ జరిపించండి




నేరేడుచర్ల సెప్టెంబర్ 07 విజన్ ఆంధ్ర : నేరేడుచర్లలో సోమవారం జరిగిన ప్రజావాణిలో తాసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని దొంతి రెడ్డి కర్ణాకర్ రెడ్డి వినతి పత్రం అందించారు తాసిల్దార్ కార్యాలయంలో విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని తాసిల్దార్ కార్యాలయంలో అవినీతి జరుగుతుందని దానికి సంబంధించిన ఆధారాలు ఎప్పుడు అడిగితే అప్పుడు కలెక్టర్ గారికి ఆర్డిఓ గారికి చూపించడానికి సిద్ధంగా ఉన్నానని వినతిపత్రంలో పేర్కొన్నారు కాబట్టి దీనిపై పూర్తి సమగ్ర విచారణ జరిపించాలని దొంతి రెడ్డి కరుణాకర్ రెడ్డి వినతి పత్రంలో కోరారు

## ప్రజా ప్రభుత్వంలోనే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నాం

**- వెల్దండ గ్రామ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

వెల్దండ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : ప్రజా ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా మండల కేంద్రంలోని పార్వతమ్మ కి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో మంజూరు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, కార్యదర్శి గిరి గౌడ్, నాయకులు కొండయ్య ,రంగనాథం ,క్రిస్టల్ ,శ్రీను ,రమేష్ ,పురుషోత్తం ,శేఖర్ సి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్ ,యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ జంగిలి ఆనంద్ ,తిరుపతి రెడ్డి, పుల్లయ్య, రషీద్ ,జంగిలి కొండల్ ,శ్రీనివాస్ ,కిష్టయ్య ,రంగయ్య బొందయ్య, కూన కృష్ణయ్య ,గోరటి



# దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ ఉపకరణాల గుర్తింపు నిర్ధారణ శిబిరం...

బోధన్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర) : బోధన్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సహాయ ఉపకరణాలను అందించేందుకు ఆలింకో ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 8 మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. బోధన్, ఎడపల్లి, రెంజల్, సాలూర, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, చందూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు పాల్గొని, ఉచిత సహాయ ఉపకరణాల గుర్తింపు మరియు నిర్ధారణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. యూడీ ఐడి కార్డు జిరాక్స్ కాపీ, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 4పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తమ వెంట తీసుకురావాలని సూచించారు. నాగయ్య మండల విద్యాశాఖ అధికారి 94400 92665, డా.విశ్వనాథ్ మహాజన్ స్పెషల్ ఎడ్యుకేటర్, స్కూల్ అసిస్టెంట్ 99494 89797, రాజ్యలక్ష్మి స్పెషల్ ఎడ్యుకేటర్ 98609 76400, విజయ్ సీఆర్పీ 90003 33098, లత
ఐఆర్పీ 70133 44869, పద్మ
ఐఆర్పీ 94911 85961 లను సంప్రదించాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిబిరానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

# కొల్లాపూర్‌లో బిఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ ,,

## విద్యార్థులతో నిరసన సభ!

**-విద్యార్థులు తలుచుకుంటే ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు**

**- కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి**

కొల్లాపూర్ సెప్టెంబర్ 7:(విజన్ ఆంధ్ర) ఎన్నికల ముందు ?కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ, నిరసన సభ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ముందుగా ?సాంబశివుడు పెట్రోల్ బంక్ నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నాయకులు, పెద్ద ఎత్తున జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఇచ్చిన ఫీజు రియంబర్స్మెంట్ జాబ్ క్యాలెండర్ల పై ప్రసంగించారు. ఎన్నికల ముందు ప్రకటించిన నిరుద్యోగ భృతి, పదో తరగతి విద్యార్థులకు ?10,000, ఇంటర్ విద్యార్థులకు ?20,000 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో మంజూరైన పాలిటెక్నిక్ కాలేజ్, పెద్దకొత్తపల్లి జూనియర్ కాలేజ్ నీ మా హయాంలో చేశామని, ఒకవైపు కరణం ఉన్న కేవలం రెండేళ్ల సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ వచ్చామని బీరం అన్నారు. ప్రభుత్వం మారగానే అభివృద్ధి పనులను నిలిపివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ యూత్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్ళి, పలు సమస్యలపై సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో సునీత లక్ష్మారెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ జగ్జీవన్ రావు విగ్రహం వద్ద రోడ్డుపై కూర్చొని బిఆర్ఎస్ నాయకులు, శ్రేణులు నిరసన తెలిపారు. ?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు, కళాశాల విద్యార్థులు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల హామీలను నెరవేర్చాలి

**- శివ వర్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు**

పెంట్లవెల్లి సెప్టెంబర్ 7:(విజన్ ఆంధ్ర) ?ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. శివ వర్మ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి పీహెచ్సీ వైద్యుడికి 'చలో హైదరాబాద్' పిలుపులో భాగంగా ఆశా వర్కర్ల తో పాటు యూనియన్ వినతిపత్రం అందజేశారు. తక్షణమే ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ. 18,000 ఫిక్స్ వేతనం అమలు చేయాలి అని, 6 నెలల పి ఆర్ సి ఏరియర్స్, పల్స్ పోలియో, లెప్రసీ, ఎలక్షన్ డ్యూటీ బిల్లులను వెంటనే చెల్లించాలి ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.? అలాగే ఎన్ సి డి ఆన్లైన్ సర్వే ఒత్తిడిని ఆపాలి అని ,ఏ ఎన్ సి టార్గెట్లను రద్దు చేయాలి అని ఆయన తెలిపారు. ?సెలవులు ఉ భద్రత: ఆదివారం, పండుగ సెలవులతో పాటు సంవత్సరానికి 20సి ఎల్ లు, 6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలి అని, అలాగే 50 లక్షల ఇన్సూరెన్స్,



ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. అంత్యక్రియల (మట్టి) ఖర్చులకు రూ. 50,000 అందజేయాలి. ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలి.?ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ ఫిక్స్ వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ ఆశాలు 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# పవన్ ఆత్మ శాంతించాలని యువకులు కొవ్వొత్తుల ర్యాలీ

నంగునూరు మండలం సెప్టెంబర్ 07 విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన ఆకుపత్తిని పవన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి ఆకుబత్తిని పవన్ కోసం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అందరు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. గ్రామంలో అందరితో కలుపుకొని సంతోషంగా ఉండేవాడని యువకులకు అందరితో మమేకమై ప్రతి విషయంలో సహకరించేవాడని యువకులు అన్నారు ఆకుపత్తిని పవన్ ఈరోజు తుదిశ్వాశ విడవడం రాజగోపాల్ పేట గ్రామంలోని యువకులకు తీరని లోటుగా భావిస్తున్నామని అన్నారు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి గ్రామ ప్రజలు పెద్దలు యూత్ సభ్యులతో కలిసి గ్రామంలోని ప్రధాన విధుల గుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి తన ఆత్మ శాంతి కలగాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు




## సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా రావినారాయణరెడ్డి 35వ వర్ధంతి వేడుకలు

రామన్నపేట, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర ): మండల కేంద్రంలో రావినారయణ రెడ్డి 35 వర్ధంతి వేడుకలు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి, ఊట్కూరినర్సిహ మాట్లాడుతు,
భారతదేశమంతా స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న నిజాం ను ఎదిరించడానికి గొరిల్లా యుద్ధమే చేయాల్సిన పరిస్థితి కమ్యూనిస్టులకు వచ్చిందని దానికి నాయకులుగా రావినారాయణ రెడ్డి ముందుండి కత్తులు, గొడ్డల్లు, పారలు, చేతికి దొరికిన ఆయుధాలతో నిజాం సర్కారు పై, రజాకారులపై దండెత్తి తెలంగాణ వివోచనం కలిగించారని, ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సిపిఐ సీనియర్ నాయకులు గంగాపురం యాదయ్య, ఊట్కూరు శీను, ఎర్ర కిరణ్ కుమార్ గౌడ్, ఊట్కూరు కృష్ణ, పల్లె మల్లేశం తదితరులు పాల్గొన్నారు...

## అనారోగ్యంతో కేశబోయిన పుల్లయ్య మృతి

రామన్నపేట, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర ): రామన్నపేట పట్టణంలో కేశవ బోయిన పుల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లయ్య మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎండి, జమీరుద్దీన్ ఉపసర్పంచ్ మోటే రమేష్, నాయకులు , వనం చంద్రశేఖర్, ఎండి, రేహాన్, ఎండి, అక్రమ్, కోట సుధాకర్, వార్డు సభ్యులు కొమ్ము శేఖర్, ఎండి,అన్వర్, గొరిగే శేఖర్, బండ లింగస్వామి,నకరికంటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.బిఆర్ స్ నాయకులు కేశబోయిన పుల్లయ్య మృతి దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బి ఆర్ ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్ కే, చాంద్, కందుల నర్సింహా, పెద్ద బోయిన మురళి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఈదమ్మ,పోచమ్మ తల్లులకు బోనాలు

సర్పంచ్ ఉండే విజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహణ
చారకొండ,సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) మండల కేంద్రంలో సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈదమ్మ, పోచమ్మ తల్లులకు బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఉ ఒడే విజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు కులస్తులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన పెట్టుకొని అమ్మవార్లకు సమర్పించారు. డప్పు చప్పుళ్ళ,మంగళ వాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపు నిర్వహించి, ఈదమ్మ, పోచమ్మ తల్లులకు ప్రత్యేక పూజలు,నైవేద్యాలు సమర్పించారు.అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా



కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈదమ్మ, పోచమ్మ బోనాల పండుగ గ్రామంలో భక్తి భావాన్ని,సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

## పి.యం.శ్రీ జడ్పీహెచ్ఎస్ మల్దకల్‌లో కొనసాగుతున్న సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

మల్దకల్,సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర): విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించడంతో పాటు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పి.యం.శ్రీ జడ్పీహెచ్ఎస్ మల్దకల్లో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.
మారుతి ఇన్‌స్ట్రక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మొత్తం 72 తరగతులుగా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ అందిస్తున్నారు. శిక్షణలో భాగంగా ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం, అప్రమత్తంగా వ్యవహరించడం, ఆత్మరక్షణకు సంబంధించిన ప్రాథమిక పద్ధతులను విద్యార్థినులకు ప్రాక్టికల్‌గా నేర్పిస్తున్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సురేష్ మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రతకు, ఆత్మవిశ్వాసానికి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యతో పాటు జీవిత నైపుణ్యాలను పెంపొందించుకోవడం కూడా విద్యార్థులకు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థినులు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొంటూ, నేర్చుకున్న ఆత్మరక్షణ పద్ధతులను సాధన చేస్తున్నారు.

## కోయిలకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

కోయిలకొండ , సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర): కోయిలకొండ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ఇంటికి పంపించడం ఖాయమని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ విఫల పాలనపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కోయిలకొండలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలన తీరుపై ఆయన తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. అన్ని వర్గాలను మోసం చేశారు..నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన తులం బంగారం, రైతు బీమా వంటి హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. కరెంటు కోతల వల్ల మోటార్లు కాలిపోయి, సాగునీరందక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రూ.2 లక్షల ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేశారని, మూడు విడతలుగా రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మించి, కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో వాగుల్లో ఇసుక దోపిడీ, అవినీతి మాత్రమే రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం గార్లపాడును మండలంగా నేటికీ ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
??ముందుగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బి. కృష్ణయ్య , మాజీ జడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి, నాయకులు బచ్చిరెడ్డి, మోదీపూర్ రవి, శ్రీనివాస్ రెడ్డి, భీమ్ రెడ్డి, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, హరి సింగ్ నాయక్, వాసు నాయక్, ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ అంజనేయులు యాదవ్, నవీన్ కుమార్, రామకృష్ణారెడ్డి, కే రాజు, టీవీ ఖాజా, పానుగంటి నాగేష్, రవి, రమేష్, భరత్. సాయి రెడ్డి. శ్రీధర్ రెడ్డి.హా శ్యాంసుందర్. లక్ష్మీనారాయణ. సాహిల్.తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయం: కొంకి వెంకటేష్




గోపాల్ పేట్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర ): తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ కొంకి వెంకటేష్ తీవ్రంగా ఖండించారు.
రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయవచ్చని, కానీ రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై వ్యక్తిగతంగా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు రాజకీయ సంస్కారానికి విరుద్ధమని పేర్కొన్నారు.
గడ్డం ప్రసాద్ కుమార్ గారు దళిత సమాజం నుంచి ఎదిగి తెలంగాణ శాసనసభకు స్పీకర్‌గా సేవలందిస్తున్నారని, ఆయనపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని కించపరచడం కాదని, దళితుల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని కొంకి వెంకటేష్ అన్నారు.
ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా హద్దులు దాటి మాట్లాడే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు.
దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎంతటి స్థాయిలో ఉన్న వ్యక్తి చేసినా సహించేది లేదని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా స్పందిస్తామని కొంకి వెంకటేష్ స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని ఆయన సూచించారు.



## పదవ తరగతి విద్యార్థులకు పాస్ (లాంగ్) మెమోలు అందజేత

మల్దకల్,సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) పదవ తరగతి మార్చి--2026 మరియు జూన్--2026 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం పాస్ (లాంగ్) మెమోలను అందజేశారు.మల్దకల్ మండలంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల--మల్దకల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పాస్ మెమోలను అందజేసి, వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సురేష్ గారు మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన విజయాన్ని అభినందిస్తూ, ఉన్నత విద్యలో కూడా క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సౌండ్ సిస్టమ్ వినియోగంపై హెచ్చరిక

**- ఎస్సై గురు స్వామి**

అయిజ సెప్టెంబర్ 07 ( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించే నిర్వాహకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం డీజే సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లందరికీ అవగాహన కల్పిస్తూ, డీజే సౌండ్ సిస్టమ్‌ల నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని అయిజ ఎస్ ఐ గురుస్వామి స్పష్టం చేశారు.

అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అయిజ ఎస్ ఐ డీజే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంపీడీవో జయరాం నాయక్**

విజన్ ఆంధ్ర నవాబు పేట.. మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులు అందరూ హాజరై అన్ని గ్రామాల ప్రజలతో వినతులు స్వీకరిస్తారు అని సమస్యలు ఉన్న వారు సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకునేందుకు సంప్రదించాలి ఎంపీడీవో జయరాం నాయక్ సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తాం అని ఎంపీడీవో జయరాం నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రతి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని పదిహేను రోజులలో పరిష్కారం అవుతుంది అని సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్. ఎంఈఓ నాగ్య నాయక్ ఎంపీఓ బద్రు నాయక్ మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ ఏపీఓ జ్యోతి ఎంపీలు సంతోష్, మహేష్ ,ఖాజా. పశుసంవర్ధక శాఖ ఎక్సైజ్ శాఖ శిశు సంక్షేమ శాఖ లో సంబంధించిన అధికారులు సూపరింటెండెంట్ గోవింద రెడ్డి ఈసీ నర్సింహ చారి తదితరులు పాల్గొన్నారు.




# భావితరాలకు స్ఫూర్తి కందూరు భాగ్యలక్ష్మి

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు ను అందుకున్న కందూరు భాగ్యలక్ష్మి



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 : (విజన్ ఆంధ్ర)

విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సామాజిక బాధ్యతతో సేవలు అందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిరంతరం బాటలు వేస్తున్న ఉపాధ్యాయురాలు కందూరు భాగ్యలక్ష్మి అని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. ఆమె సేవలను గుర్తించి జిల్లాస్థాయి 'ఉత్తమ ఉపాధ్యాయురాలిగా'కందూరు భాగ్యలక్ష్మి కి అవార్డును ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.ఆమెకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు విద్యాభిమానుల నుండి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

?అంకితభావానికి దక్కిన తగిన గౌరవం

విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ, వారిని చక్కటి క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగ్యలక్ష్మి నిరంతరం కృషి చేస్తుందన్నారు. తన అంకితభావం, నిబద్ధత, సేవా తత్పరతకు లభించిన ఈ జిల్లా స్థాయి అవార్డు, ఆమె పడుతున్న కష్టానికి దక్కిన నిజమైన గౌరవమని పలువురు కొనియాడారు.

?"ఉపాధ్యాయ వృత్తి కేవలం ఒక ఉద్యోగం మాత్రమే కాదు... అది భావి తరాలను తీర్చిదిద్దే మహోన్నత బాధ్యత" అని నిరూపిస్తూ భాగ్యలక్ష్మి అందిస్తున్న సేవలు నాగర్‌కర్నూల్ జిల్లాలోని మరెంతో మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి తో పాటు విద్యావేత్తలు కొనియాడారు.?ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, ఆమె సేవలు విద్యారంగానికి నిరంతరం అందాలని ఆకాంక్షిస్తూ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నా సేవలను గుర్తించి నాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డును అందజేసిన జిల్లా విద్యాశాఖ అధికారికి తోటి ఉపాధ్యాయులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఓ తో పాటు తోటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన భారతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



గోపాల్ పేట్ సెప్టెంబర్ 07( విజన్ ఆంధ్ర ) : రేవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సి. భారతి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉపాధ్యాయురాలిగా ఎంపికైన భారతి ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించారు.రేవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సి. భారతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, విద్యాబోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారిలో సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను పెంపొందించేందుకు ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు.ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచుతున్నారని పేర్కొన్నారు.ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడితేనే వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరనే ఆలోచనతో భారతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల చదువు, ప్రవర్తన, అభ్యసన పురోగతిపై అవగాహన కల్పిస్తూ పాఠశాల--తల్లిదండ్రుల మధ్య మంచి సంబంధాలను ఏర్పరచడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు.ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సి. భారతి ఎంపిక కావడం రేవల్లి మండలానికి, పాఠశాలకు గర్వకారణమని, ఆమె సేవలను గుర్తించి ఈ గౌరవం దక్కడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఆమె మరింత ఉత్సాహంతో విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయురాలి కృషికి దక్కిన ఈ గుర్తింపు.. విద్యార్థుల భవిష్యత్తుకు మరింత స్ఫూర్తినిస్తుంది" అని పలువురు పేర్కొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఘన సన్మానం

మక్తల్, సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర వాసవి క్లబ్ వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు పాత్రికేయులకు శాలువ కప్పి ఘనంగా సన్మానించి, పెన్నును బహుకరించడం జరిగింది. వాసవి క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. మా మిత్రులు పాత్రికేయులు నాకు ఎప్పుడూ వారి సహకారం ఉందని , వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లే విధంగా పేపర్ కవరేజ్ చేసి వాసవి క్లబ్ మొత్తంలో చాలా అద్భుతంగా కార్యక్రమాలు చేస్తున్నాయని వారు వారి పత్రికల ద్వారా ప్రచురించడం చాలా ఆనందంగా ఉందని, ఎప్పుడూ కూడా వారి సహకారం నాకు ఉండాలని, వారి ద్వారా ఉంటుందని నమ్మకం ఉందని, పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ క్రీడలలో భాగంగా వాసవి సభ్యులకు పరుగు పందెం పోటీ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా వాసవి క్లబ్ ట్రెజరర్ మనసాని నాగరాజ్ వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, పృథ్వీరాజ్, అంజయ్య చారి, కార్తీక్ వెంకట్ రెడ్డి, వాసవి క్లబ్ పెద్దలు పాల్గొన్నారు.





# శ్రీ నాగేంద్ర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ..!

మహాదేవపూర్ సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర ) శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ నాగేంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీ నాగేంద్ర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 గంటలకు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ మహేష్, ధర్మకర్తల సమక్షంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు పాణీంద్ర శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ నాగేంద్ర స్వామి వారికి పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠను పూర్తి చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల కు దర్శనం ను కల్పించారు. శ్రీ నాగేంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంతో ఆలయ అధికారులు, ధర్మకర్తలు, అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు శ్రీ నాగేంద్ర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్, సర్పంచ్ వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి, ధర్మకర్తలు గందెసిరి సత్యనారాయణ, సుంకరి సీతయ్య, అశోక్, శ్రీధర్ రావు, కుమారస్వామి, ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠశాల యూనిఫారాలు పంపిణీ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యూనిఫారాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి మహేశ్వర్ పాల్గొని విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామస్థాయిలో సహకారం అందిస్తామని వారు తెలిపారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయురాలు స్నేహ, వెలుగు సీసీ ప్రసాద్, సీఏ శ్రీనివాస్, బుచ్చయ్యపల్లి మహిళా సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి పానుగంటి తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం విడ్డూరం...

**- ఆరు గ్యారంటీలు అమలు చేయాలి...**

**- బీఆర్ఎస్ నాయకురాలు అయేషా ఫాతిమా..**



బోధన్, సెప్టెంబర్07 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బోధన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆచన్ పల్లి నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్డీఓ విజయకుమారి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి అయేషా ఫాతిమా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చి మర్చిపోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా హామీల అమలు మాత్రం జరగలేదని మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ కి వెళ్తున్న ఎమ్మెల్యే లను అడ్డుకుని అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలు అని చూడకుండా ఇష్టా రీతిగా వ్యవహరించడం పట్ల పోలీసుల తీరుపై మండిపడ్డారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యే లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మండలాల అధ్యక్షులు సంజీవ్, నర్సింగ్ రావు, శ్రీ రామ్, భూమారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మి, అశోక్ రెడ్డి, మోబీన్, నాయకులు తెడ్డు పోశెట్టి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు.. 420 హామీలు అమలు చేయాలి

## - తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకుల మెమోరాండం



కొండాపూర్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 07: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొండాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని ప్రజల పక్షాన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా వికలాంగులకు రూ.6 వేల పింఛన్, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా 18 ఏళ్లు నిండిన యువతులకు స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ఎన్నికల వాగ్దానాలుగా మిగిల్చకుండా, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మ్యకం విఠల్, జిల్లా బీఆర్ఎస్ నాయకులు మల్లా గౌడ్, ప్రేమానందం, పాండురంగం, రుక్ముద్దీన్, అమరేందర్ రెడ్డి, మహేష్, వినోద్, అనిల్, రామగౌడ్, ఇంద్రారెడ్డి, సత్యానందం, నర్సింలు, రాములు నాయక్, జలీల్, సంతోష్‌రెడ్డి, రాజు, రవి, మొగులయ్య, జగదీష్, ప్రకాష్, మోహన్ గౌడ్, రామచంద్రరాజ్, కుమార్, శ్రీకాంత్, సంగారెడ్డి రాజు, నమ్మే నాయక్, కిష్టారెడ్డి, శేఖర్, రవీందర్, సాయిరెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

**కాంగ్రెస్ నాయకులు**



మందమర్రి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..? పదేళ్లు ఏం చేశారో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శ్వేత పత్రం విడుదల చేయాలంటూ డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సూపర్ బజార్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ అసహనానికి నిదర్శనమని వారు గుర్తు చేశారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న మంత్రిపై మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు బాల్క సుమన్ కు లేదన్నారు. పదేళ్లపాటు ఎంపీ, ఎమ్మెల్యేగా వివిధ పదవుల్లో ఉన్న బాల్క సుమన్ చెన్నూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. నిజంగా చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వ్యక్తిగత విమర్శలు మానుకొని అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాలు చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, రాజేష్, శ్రీనివాస రావు, శ్రీనివాస్, సతీష్, ప్రేమ్ సాగర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన కొక్కిరాల సురేఖ

నస్పూర్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల ఐదవ డివిజన్లో మంచిర్యాల జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ
నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా
మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం కొక్కిరాల సురేఖను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, నస్పూర్ పట్టణ ఇన్చార్జి రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం...

బోధన్, సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ?ఉదయం తెల్లవారుజాము నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి దివ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల శ్రేయస్సును కాంక్షిస్తూ శ్రీ లలితా సహస్రనామ పారాయణము, కుంకుమార్చన పూజలు ఘనంగా జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ?మహా హారతి అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం ప్రాంగణమంతా అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. ?ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొత్త రాజేశ్వర్ గుప్తా, పబ్బ మురళి, కంటాల రమేష్, వాసర గంగాధర్, సంతోష్, కిరణ్, నాగ దుర్గ ఆంజనేయులు ఆర్యవైశ్య సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో బిఆర్ఎస్ నేతల గళం..

**- సమస్యలపై ఎంపీడీఓకు వినతి**

కుకునూరుపల్లి, సెప్టెంబర్ 07,విజన్ ఆంధ్ర : మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు, సర్పంచ్ లు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ అలికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, డ్రైనేజ్ తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బచ్చలి మహిపాల్, నర్సింహులు, భగవంతం, సర్పంచ్ లు కర్ణాకర్, మధు మోహన్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకు సంక్షేమ పథకాలు ఎప్పుడిస్తారు?

**- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. ఆరు గ్యారెంటీల అమలేది?**

**- కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**- ఆరు సర్కిళ్ల కార్యాలయాల వద్ద ఆందోళన.. అధికారులకు వినతిపత్రాలు**

బాచుపల్లి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆరో రోజు అధికారులకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల్, జీడిమెట్ల, గాజులరామారం, దుండిగల్, కొంపల్లి, నిజాంపేట్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

జీడిమెట్లలో వినతి

జీడిమెట్ల సర్కిల్ సిఎంసి కార్యాలయంలో కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉప కమిషనర్ శంకర్‌సింగ్‌ను కలిసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

చింతల్‌లో నిరసన

చింతల్ సర్కిల్ కార్యాలయంలో రంగా రెడ్డినగర్, చింతల్, జగద్గిరిగుట్ట డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఉప కమిషనర్ స్పందనను కలిసి సంక్షేమ పథకాల అమలుపై వినతిపత్రం అందజేశారు.

గాజులరామారంలో వినతిపత్రం

గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో గాజులరామారం, సూరారం డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉప కమిషనర్ వెంకటరాములును కలిసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

కొంపల్లిలో డిమాండ్

కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో కొంపల్లి, దూలపల్లి, సుభాష్‌నగర్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఉప కమిషనర్ లావణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

దుండిగల్‌లో ఆందోళన

దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో బహదూర్‌పల్లి, బౌరంపేట్, దుండిగల్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉప కమిషనర్ మణికరణ్‌ను కలిసి సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిజాంపేట్‌లో వినతి

నిజాంపేట్ సర్కిల్ కార్యాలయంలో బాచుపల్లి, ప్రగతినగర్, నిజాంపేట్, బండారిలేఅవుట్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఉప కమిషనర్ మణికరణ్‌ను కలిసి అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

అమలు చేయని హామీలతో ప్రజలను మోసం చేశారు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: బీఆర్ఎస్ నిరసన

పాపన్నపేట సెప్టెంబర్7,(విజన్ ఆంధ్ర ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పాపన్నపేటలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పార్టీ శ్రేణులు పాపన్నపేట చౌరస్తా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హామీలను అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు బోనస్ విషయంలో ఏడు రకాలకే పరిమితం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు నష్టం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని విమర్శించారు.




ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుమ్మరి జగన్, నాయకులు గురుమూర్తిగౌడ్, శ్రీనాథ్‌రావు, వెంకటేశం, దారబోయిన మల్లేశం, బాబాగౌడ్, కిష్టాగౌడ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, సిద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి

**- 6 గ్యారెంటీలు.. 420 హామీలు అమలు చేయాలి**

బెల్లంపల్లి సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు కాసిపేట మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 22-ఏ నిబంధనల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించి, 22-ఏ నిబంధనను రద్దు చేయాలని కోరారు.



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

దండేపల్లి 7దండేపల్లి(విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ, సోమవారం బీ ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దండేపల్లి తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ మాధవికి వినతి పత్రం అందజేశారు, ఆడబిడ్డలకు మహాలక్ష్మీ పథకం కింద 2500 ఆర్థిక సాయం, ఆటో డ్రైవర్ లకు 1200, పెన్షన్ పెంపుదల, తో పాటు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చాలని, వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నాయకులు పసర్తి అనిల్, రేని శ్రీనివాస్, చీపతి మల్లయ్య, గొట్ల భూమన్న, కాసనగొట్టు లింగన్న , బచ్చల అంజన్న,ఉస్మాన్ఖాన్,తదితరులు,పాల్గొన్నారు,


## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

**- సాదుల పవన్ కుమార్ - మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్**

నంగునూరు మండలం సెప్టెంబర్ 07 విజన్ ఆంధ్ర : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ నంగునూరు మండల కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తాతా మధు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ పవన్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అనుచిత భాష ఉపయోగించడం సరికాదన్నారు. సభాపతిపై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటిదని విమర్శించారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ చరిత్రలోనే చీకటి రోజుగా నిలిచిపోతుందని అన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పవన్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్తో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించాలని, ఆయన సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు యండి ఇమ్రాన్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి ఎంతో గౌరవం, ప్రాధాన్యత ఉంటాయని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తల పట్ల వ్యవహరించిన తీరును ఆ పార్టీ నేతలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఇమ్రాన్ సూచించారు. అప్పటి పరిణామాలను మరిచిపోయి ఇప్పుడు ప్రజాస్వామ్యం, ప్రతిపక్ష హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల తరఫున బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఇమ్రాన్ అన్నారు. రాజకీయ విమర్శలు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు.

# ప్రజావాణిలో బీఆర్ఎస్ నేతల వినతి

**- 22ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములు తొలగించాలని డిమాండ్**



బెల్లంపల్లి సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ బెల్లంపల్లి మండల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను తొలగించి, పంట రుణాలు పొందేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం గణేష్గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు కూలీలకు ఆర్థిక సాయం వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం, యువ వికాసం, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు హామీ ఇచ్చిన విద్యా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, ... ప్రజలను మభ్యపెట్టేందుకు హామీలు ఇవ్వడం కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు గొమాస శ్రీనివాస్, సుభాష్రావు, కొమ్మెర లక్ష్మణ్, సర్పంచ్ సింగతి రాజేష్, కొప్పుల అశోక్, చల్లూరి వెంకటేష్, రత్నం సోమయ్య, రామగౌని అశోక్గౌడ్, పాయవేణి మల్లేష్, కుక్క రామచందర్, కారుకూరి వెంకటేష్, పొలవేణి శ్రీనివాస్, గంధం తిరుపతి, కొత్తపల్లి మహేందర్, పంజాల శ్రీనివాస్గౌడ్, జిల్లెపెల్లి వెంకటస్వామి, మాడ గోపాల్, చంద్రమౌళి, ఆవుల శ్రీనివాస్, మోట పలుకుల రాజశేఖర్, రంగ మల్లేష్, బత్తుల రమేష్, భూమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం.. మహాదానం

**- మరణానంతరం నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి**

**- ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు**

**- అపోహలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలి: లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి**



బాచుపల్లి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): నేత్రదాన పక్ష ఉత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్లోని సితార గ్రాండ్ హోటల్లో 'నేత్రదానం--మహాదానం' అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించడంతో పాటు, మరణానంతరం నేత్రదానానికి సంబంధించిన అపోహలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణించిన అనంతరం వీలైనంత త్వరగా, సాధ్యమైనంత వరకు మూడు గంటలలోపు కుటుంబ సభ్యులు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి లేదా సమీపంలోని పెద్ద కంటి ఆసుపత్రికి సమాచారం అందిస్తే, సంబంధిత వైద్య బృందం వచ్చి నేత్ర సేకరణ ప్రక్రియ చేపడుతుందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, మరణానంతరం నేత్రదానం చేసేలా కుటుంబ సభ్యుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. లయన్ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి చేసే నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం కల్పించే నేత్రదానం కంటే గొప్ప దానం మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని, నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జి.వి. రమణారెడ్డి, వి. తిరుపతిరెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, డి.వి. రమణారెడ్డి, లయన్ హనుమాండ్లు, లయన్ పద్మా ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ భరోసా

**- సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే**

**- తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులపై వినతులు**

**- పీఎం రెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి అభినందనలు**

షాపూర్ నగర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం షాపూర్నగర్లోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలుసుకుని వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు



సంబంధించిన సమస్యలను వివరించారు. ప్రజలు తెలిపిన సమస్యల్లో కొన్నింటిపై కూన శ్రీశైలం గౌడ్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మరికొన్ని సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నూతన కమిటీకి అభినందనలు

ఇదిలా ఉండగా, గాజులరామారం డివిజన్ పరిధిలోని పీఎం రెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పాండుతో పాటు కార్యవర్గ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి ముందుకు సాగాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు./ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హౌస్ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**- అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పట్లోళ్ల ధనుష్ రెడ్డి అరెస్ట్**



చేవెళ్ల, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): హౌస్ అరెస్టులు, పోలీసుల ఆంక్షలతో విద్యార్థుల కోసం తమ పోరాటాన్ని ఆపలేరని బీజేపీ యువ నాయకుడు పట్లోళ్ల ధనుష్ రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పట్లోళ్ల ధనుష్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.1,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద, మధ్యతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అరెస్టులు, కేసులతో బీజేపీ పోరాటాన్ని ఆపలేరని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే హక్కును అడ్డుకోవడం సరికాదన్నారు. విద్యార్థులకు బకాయిలు చెల్లించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ధనుష్ రెడ్డి స్పష్టం చేశారు.

# అనంత్ రెడ్డి అరెస్ట్...



చేవెళ్ల, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని చేవెళ్ల బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో అనంత్ రెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ చేపట్టిన ఉద్యమాన్ని అరెస్టులతో నిలువరించలేరన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.1,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు అందక పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజల సమస్యలపై నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో బీజేపీ నాయకుల గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని అనంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గౌరవెల్లిలో త్రీ ఫేజ్ డీటీఆర్ కరెంట్ కష్టాలకు చెక్

**మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ దాము, గ్రామస్తులు**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 7 : సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామం ఎస్సీ, వడ్డెర కాలనీల్లో మంచినీటి బోరుబావులకు గతంలో సరైన కరెంటు సరాఫరా లేక ప్రజలకు సమయానికి నీళ్లు అందకుండా అనేక ఇబ్బందులు పడ్డారని,ఈ విషయాన్ని సర్పంచ్ పాండ్రాల దాము ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనేమంత్రి స్పందించి త్రీఫేజ్, సింగిల్ ఫేజ్ డిటిఆర్ లను మంజూరు చేయించారన్నారు.దీంతో విద్యుత్ అధికారులు సోమవారం స్తంభాలకు వీటిని బిగించి అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని ఏళ్లుగా ఈ బోరు బావులకు సపరేట్ విద్యుత్ సరఫరా లేక రాత్రి, పగలు తేడా లేకుండా ఫేజు వైర్ కొట్టేయడంతో ట్యాంకు నీళ్లు రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.ఆ ఇబ్బందులకు డిటిఆర్ తో చెక్ పడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇవే కాకుండా గౌరవెల్లి గ్రామంలో ఉన్నటువంటి ఎస్టీ కాలనీలో మూడు విద్యుత్ స్తంభాలు కూడా బిగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దాము మాట్లాడుతూ గౌరవెల్లి గ్రామం గత పాలకుల పాలనలో అభివృద్ధిలో చాలా వెనుకబడిపోయిందని, ప్రస్తుతం మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఒక్కొక్క పని చేసుకుంటూ ప్రజల అవసరాలను తీరుస్తున్నానని అన్నారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నింటినీ ఒక్కొక్కటిగా క్లియర్ చేస్తానని హామీ ఇచ్చారు. డిటిఆర్ మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు, ఆలస్యం చేయకుండా డీటీఆర్ బిగించిన విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# TGEJAC పిలుపు మేరకు "చలో హైదరాబాద్"ను విజయవంతం చేయాలి



నస్పూర్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీన తలపెట్టిన "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ నాయకులు కోరారు. గురువారం ఐడీవోసీ నస్పూర్ లో జిల్లా చైర్మన్ శ్రీ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ శ్రీమతి వనజా రెడ్డిల ఆధ్వర్యంలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించి, 'చలో హైదరాబాద్' వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ శ్రీహరి మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా నుండి దాదాపు 5 వేల మందికి తగ్గకుండా ఉద్యోగులు హైదరాబాద్ కు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ భాగస్వాములై ఈ పోరాటాన్ని జయప్రదం చేయాలని సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారుల సంఘం నాయకులు దుర్గాప్రసాద్, కిషన్, గణపతి, శ్రీమతి రాజేశ్వరి, టీజీఈజేఏసీ కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అత్తే సుధాకర్, బొడ్డు శ్రావణ్, నాయకులు తిరుపతి, సత్యనారాయణ, ప్రభుతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణపయ్యకు ఘనంగా స్వాగతం- వైభవంగా 18వ వార్డు గణేష్ విగ్రహ ఊరేగింపు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 7 విజన్ ఆంధ్ర : శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డు ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండల్ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాన్ని మార్కెట్ ఏరియాలో సోమవారం ఘనంగా ఊరేగించారు. భారీగా తరలివచ్చిన భక్తులు, యువత గణపతి బప్పా మోరియా నినాదాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి పట్టణ నాయకులను గణేష్ మండల్ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణేష్ మండల్ కమిటీ సభ్యులు రాకేష్ జోషి, అభిషేక్ కార్వ, రేణికుంట్ల రాహుల్, కొత్తపల్లి సాకేత్, కృష్ణకాంత్ బంగ్, కైలాష్ జోషి, హనుమాన్ జోషి, అశోక్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీలెక్కడ.. అరెస్టులెందుకు..?

**- 6వ రోజు ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నిరసన..**

**- అగ్రనేతల అరెస్టుపై బీజాపూర్ రహదారిపై రాస్తారోకో**



చేవెళ్ల, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వరుస నిరసనల్లో భాగంగా సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట 6వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు కె.టి.రామారావు, తన్నీరు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డిలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు బీజాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను సహించేది లేదని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తోట శేఖర్, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు దేవులపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దూత మల్లేష్, మంగమ్మ మల్లేష్, డప్పు సువర్ణ చందు, మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, శేరి రాజు, శేరి శివారెడ్డి, మహేందర్, నత్తి కృష్ణారెడ్డి, ఊరడి రాంప్రసాద్, బ్యాగరి నర్సింలు, పాండు, దండు సత్యం, గోనె రాహుల్‌రెడ్డి, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.